క్లుప్తంగా

ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పైమాఘం సుగుణాకర్ రెడ్డి

తవణంపల్లె: ప్రజలకు సేవ చేయడమే ధ్యేయమని అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. అరగొండ పంచాయతీ బీసీ కాలనీలో ఆదివారం తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వాటర్ ప్లాంట్‌లో స్విచ్ ఆన్ చేసి స్థానికులకు పరిశుద్ధ నీటిని అందించారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లుదొరై, మాజీ సర్పంచ్ కరీం, ప్రశాంతకుమార్, చలపతి ల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు అర్జీలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెరుకు ట్రాక్టర్లతో ట్రాఫిక్ జామ్

నగరి: పరిమితికి మించి చెరుకు లోడ్డుతో వెళ్లే ట్రాక్టర్ల కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాధారణంగా ఎక్కించాల్సిన లోడ్డుకన్నా ప్రత్యేకంగా సిద్ధం చేసిన ట్రాలీలలో అధిక లోడ్డుతో ట్రాక్టర్లు వెళుతున్నాయి. నెలవాయి ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీలకు వెళ్లే క్రమంలో ఈ ట్రాక్టర్లు పట్టణ పరిధిలోని నాగలాపురం రోడ్డు, పళ్లిపట్టు రోడ్డు మీదుగా వెళుతున్నాయి. దీంతో ఈ మార్గంలో ఎదురుగా బస్సులు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలు వాహనాలు రోడ్డుపై ఆగిపోతున్నాయి. వీటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

వారం రోజుల క్రితం వరకు ఇలా..

పూతలపట్టుకు చెందిన గర్భిణికి అర్ధరాత్రి పురిటినొప్పులు అధికమయ్యాయి. కుటుంబీకులు వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి డాక్టర్లు తక్షణమే స్పందించి సిజేరియన్ చేయాలని లేబర్ రూమ్‌కు తీసుకెళ్లారు. అక్కడ క్లీనింగ్ పేరుతో రూ.200 గుంజుకున్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తండ్రిని పిలిచి రూ.2వేలు ఇస్తే తప్ప బిడ్డను ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. చేసేది లేక రూ.1500 ఇచ్చి, బిడ్డను చేతిలోకి తీసుకున్నారు. అక్కడి నుంచి గదికి మార్చడానికి రూ.500 అడిగారు. రూ.200 ఇస్తే సరిపోదని మొండికేశారు. తర్వాత డ్రెస్సింగ్, క్లీనింగ్ అంటూ రూ.200, రూ.100 వసూలు చేశారు. ఇలా ఆరాత్రి అనుభవం ఆ మధ్య తరగతి కుటుంబానికి భారంగా మారింది. వారు గోడమీద ఉన్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి ఫిర్యాదులు వందల సంఖ్యలో ఉన్నతాధికారులకు వెళ్లాయి.

వసూళ్లపై కలెక్టర్ ఏమన్నారంటే...

వారం రోజుల క్రితం వైద్య విధాన పరిషత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వసూళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పనికి డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారంటే వాళ్లంతా పేదలే కదా అంటూ చెప్పుకొచ్చారు. ఇకపై డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు వస్తే ఊరుకోను అంటూ అధికారులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

ప్రభుత్వాస్పత్రిలో వసూళ్లకు బ్రేక్

- కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ
- వెంటనే స్పందించిన కలెక్టర్
- ఆస్పత్రి అధికారులకు తీవ్ర హెచ్చరిక



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వసూళ్ల పర్వం పతాక స్థాయికి చేరింది. ప్రతి పనికి కాసులు వసూలు చేసేవారు. ప్రసవం, ఆపరేషన్లు, ఇతరత్రా సేవలకు పేదలు చెల్లించుకోవాల్సి వచ్చేది. ఇక్కడ పేద, ధనిక తేడా లేకుండా గుంజేసేవారు. ఈ అడ్డగోలు వసూళ్లకు బాధితులు వరుసగా జిల్లా యంత్రాగానికి ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్ ఆస్పత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ప్రస్తుతం వసూళ్లకు బ్రేకులు పడ్డాయి.

కింది స్థాయి నుంచే మొదలు..

ఉచిత ఆరోగ్య సేవలను కొందరు అమ్మకానికి పెడుతున్నారు. వేలల్లో జీతాలను లెక్కచేయకుండా, అదనపు వసూళ్ల కోసం పేదల ఉసురు తీస్తున్నారు. దీంతో ఆస్పత్రి పరువు బజారున పడింది. ఆస్పత్రికి నిధులు లేవని సాకుచూపి వైద్య సేవలను కాసుల సేవగా మార్చేశారు. ఆస్పత్రిలో అడుగు పెట్టినప్పటి నుంచి బయట అడుగు పెట్టేంత వరకు కాసులు గుంజడంతో పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి. అమాయకులు అడిగింత ఇచ్చి వెళుతున్నారు. చదువుకున్నవారైతే ఎందుకని ప్రశ్నిస్తున్నారు. దీంతో వారిని ఛీదరించుకుంటున్నారు. అడ్మిట్‌లో ఉన్నా పట్టించుకోరని భావించి కాసులు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తోంది. ఎందుకిలా అంటే పైవాళ్లు వసూలుచేయమన్నారని చెప్పేవారు. ఫిర్యాదులు వస్తే..కార్యాలయంలో అనుకూలంగా ఉన్న కొందరు చూసుకుంటారనే ధీమాతో రెచ్చిపోయే వాళ్లు. అయితే ఈ వారం రోజుల పాటు వసూళ్లు లేవని రాత్రిపూట డ్యూటీలకు వచ్చే సిబ్బంది ముఖం చాటేయడం గమనార్హం. ప్రస్తుతం వారు గందర గోళం సృష్టిస్తున్నారు.

వారం రోజులుగా నిల్...

కలెక్టర్ హెచ్చరికలతో ఆస్పత్రి వర్గం ఉలిక్కిపడిపోయింది. వెంటనే ఆస్పత్రిలోని సిబ్బందిని పిలిచి అపోలో, ప్రభుత్వ వైద్యాధికారులు వసూళ్ల పర్వంపై గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. డబ్బులు వసూలు చేస్తే ఇంటికి పంపడం ఖాయమని సూటిగా చెప్పారు. డబ్బులు వసూళ్లు చేసినట్లు వాళ్ల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చారించారు. దీంతో ఆస్పత్రిలో వసూళ్లకు బ్రేకులు పడ్డాయి.

వసూలు చేస్తే వదిలిపెట్టం



ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారంతా పేదలు. వారి దగ్గర డబ్బులు అడగడం సరికాదు. వారం రోజులకు క్రితమే గట్టిగా చెప్పాం. ఇకపై కాసుల వసూళ్లు జరగవు. అలా చేసి ఎవరైనా చేతికి చిక్కినా..లేదా ఫిర్యాదులు వెళ్లినా కచ్చితంగా చర్యలు ఉంటాయి. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. పద్ధతి మార్చుకుని పని చేయాలి.

–ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో నీటి సమస్యలుంటే 98499 07885 నంబర్‌కు కాల్ లేదా వాట్సాప్ చేయాలని కమిషనర్ పి.నరసింహప్రసాద్ ఆదివారం తెలిపారు. వేసవి నేపథ్యంలో నీటి సమస్య పరిష్కారానికి నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఆ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నీటి సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న రుణాలకు ఇంటర్వ్యూలు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని కమిషనర్ పి.నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం 1–25 డివిజన్ వాసులకు, బుధవారం 26–51 డివిజన్ పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నగరపాలక కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.నరసింహప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మారథంపై శివపార్వతుల విహారం



స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



బ్రహ్మారథంపై మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ

బంగారుపాళెం: మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం సాయంత్రం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ బ్రహ్మరథంపై భక్తులకు కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథానికి పూజలు చేసి, వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మంటపం నుంచి తీసుకువచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. సతీసమేతుడైన శ్రీకామాక్షమ్మ, మొగిలీశ్వరస్వామి, బ్రహ్మరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మరథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మొగిలి శివాలయానికి చేరుకోవడంతో భక్తజన సంద్రంగా మారింది. రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మరథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. బ్రహ్మరథోత్సవానికి బెంగళూరు ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కళాశాల యజమాని నరసరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మ రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నేడు పుష్పపల్లకి

మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి పుష్పపల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.


ఉచిత కంటి ఆపరేషన్లకు 22 మంది



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కు ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దివంగత ఎంపీ చెంగల్‌రాయ నాయుడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు శిబిరానికి వచ్చిన 105 మందికి పరీక్షలు చేశారు. అందులో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని తిరుపతికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మాజీ సర్పంచు కమలనాథ రెడ్డి, బీజేపీ నాయకులు జగదీశ్వర్, భానుప్రకాష్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి కోసం వానర పాట్లు





గుడిపాల: వానరాలు దాహానికి తహతహలాడుతున్నాయి. ప్రస్తుతం వేసవి తాకిడి మొదలైంది. నరహరిపేట వద్ద ఓ ట్యాంక్ వద్ద ఉన్న వాటర్‌బాటిల్‌ను ఓ వానరం తీసుకెళ్లి అందులో ఉన్న నీటిని తాగి దాహం తీర్చుకుంది. వసంతాపురం సచివాలయం వద్ద ట్యాప్‌ను ఆన్ చేసుకొని మరి దాహార్తిని తీర్చుకుంది మరో వానరం.

అడవిపందుల బెడదతో బెంబేలు



బొమ్మసముద్రంలో ఆకుకూరల పంటలకు చీరలు కట్టుకున్న రైతు

- రాత్రిళ్లు పంటను నాశనం చేస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు
- రక్షణకు ఇనుపతీగలు, చీరలు ఏర్పాటు

గుడిపాల: రెక్కలు ముక్కలు చేసుకొని కూరగాయ పంటలు సాగుచేస్తున్న రైతులకు ఓ వైపు గిట్టుబాటు ధరలు దెబ్బతీస్తుంటే, మరోవైపు అడవి పందుల మూలంగా మరింత నష్టపోతున్నారు. రాత్రిళ్లో పందులు గుంపులుగా వచ్చి పొలాల్లో కూరగాయల తోటలను నాశనం చేస్తుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కొందరు పందుల బారినుంచి పంటల నుంచి రక్షించేందుకు గాను ఇనుపతీగలు, చీరలు వంటివి పొలాల్లో వేలాడదీస్తున్నారు. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వరి, రబీ సీజన్‌లో కూరగాయల పంటలను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. ప్రస్తుతం చిత్తపార, బండపల్లె, చింతగుంటూరు, పేయనపల్లె, 197రామాపురం, ఏఎల్‌పురం, వసంతాపురం, బొమ్మసముద్రం, గొల్లమడుగు తదితర గ్రామాల్లో కూరగాయలతో కొద్దోగొప్పో వేసుకున్న వరిపంటను కూడా పందులు నాశనం చేస్తున్నాయి. ప్రధానంగా రాత్రిళ్లలో ఈ అడవిపందులు చొరబడుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పగలంతా పొలం పనులు చేసి రాత్రిళ్లు పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కొందరు రైతులు రాత్రిళ్లు కాపలా వెళ్లలేక ఇనుపతీగలు, చీరలు, కొయ్యలు నాటి దారాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అడవి పందుల బారినుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

మహిళలకు జీవనజ్యోతి పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కర్తవ్యాన్ని విడవకుండా, స్వార్థానికి లోబడకుండా వుండే స్త్రీత్యాగం సృష్టి ఉద్దీపనమని ప్రముఖ సాహితీవేత్తలు జి.శాంతకుమారి, కె.సి.లావణ్య పేర్కొన్నారు. నగరంలోని రెడ్డి భవన్‌లో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ గౌరవాధ్యక్షులు మల్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'స్త్రీవాద కవిత్వం'పై జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మహిళలకు జీవనజ్యోతి పురస్కారాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కీచకుల కాలరాచు వీరనారీమణులుగా మహిళలు శక్తియుక్తులను ప్రదర్శించాలన్నారు. నయాకేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎడ్లపల్లి మాధుర్య మాట్లాడుతూ స్త్రీ ధిక్కార స్వరాలే స్త్రీవాద కవిత్వం అన్నారు. రచయిత సమాఖ్య జాతీయ అధ్యక్షులు సి.నారాయణస్వామి, ప్రముఖ కవి కొఠారి వెంకట రత్నం సంయుక్తంగా మాట్లాడుతూ స్త్రీవాద భావ ప్రకటనతోనే సమాజంలో తమ అస్తిత్వ నిరూపణకు పోరాడుతున్న మహిళలు అభినందనీయులని అన్నారు. 12 మంది మహిళలకు 'జీవనజ్యోతి'జాతీయ పురస్కారాలను, 24 మంది సాహితీవేత్తలను మరియు సంఘసేవకులను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి మాధుర్య, ఎస్.చంద్రకళ, కె.ప్రేమావతి, ఇ.గంగాభవాని, కె.నాగమణి, పి.స్వప్న, టి.హార్తి, కె.తులసి, పి.జగదాంబ, టి.మంజులదేవి, సన్మాన గ్రహీతలు సి.నారాయణస్వామి, నందిపాటి చక్రపాణి, డా.కొఠారి వెంకటరత్నం, తోట గోవిందన్, ఎం.శ్రీరాజు, ఎస్.మునీంద్ర, కోటేశ్వర మొదలియార్, హరిప్రసాద్ రెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, టి.రామ చంద్ర, వి.పవన్, అనంత పద్మనాభన్, రంగనాథన్, ఎస్.షణ్ముగం, ఆనందనాయుడు, డి.రోహిత్ పాల్గొన్నారు.

నాటి మధుర జ్ఞాపకాలు అపురూపం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నాటి మధుర జ్ఞాపకాలు అపురూపం అని రిటైర్డ్ తహసీల్దార్ నారాయణ అన్నారు. నగరంలోని ఎస్జీవోస్ హోమ్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లిలో 1967– 68లో పదో తరగతి చదివిన విద్యార్థులు 57 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిశారు. రిటైర్డ్ తహసీల్దార్, పూర్వ విద్యార్థి నారాయణ మాట్లాడుతూ ఆరోజుల్లో గురువుల ఉత్తమ విద్యాబోధన వల్ల ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామన్నారు. వివిధ హోదాల్లో స్థిరపడిన స్నేహితులంతా ఒకచోట కలిసి అనుభవాలను, అనుభూతులను పంచుకోవడం చాలా సంతోషకర పరిణామమన్నారు. అనంతరం తమ అనుభవాలు, చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, చిన్నస్వామి, అమరావతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పంపిణీ



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. బలిజల్లో 20 మంది పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కిషోర్, గిరి, శ్రీధర్, వంశీ, ప్రభాకర్, కిరణ్, చందు, కుమార్ యశ్వంత్ పాల్గొన్నారు.

మామిడి పూత.. జాగ్రత్త!



బూడిద తెగులుతో ఎండిపోయిన మామిడి పూత



పూత కోసం మందుల పిచికారీ చేస్తున్న రైతులు

పాలసముద్రం: మామిడిలో మంచి దిగుబడి రావాలంటే పూత, పిందె ప్రధానం. పూత రాలే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని చిత్తూరు డివిజినల్ ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.ఈ సంవత్సరం పంటకు అనుకూలమైన పరిస్థితి ఉందనుకుంటే వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో ఇంతవరకు మామిడి తోటలో పూత రావడం లేదు. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మామిడి పంట నష్టపోకుండా అనుకున్న దిగుబడి సాధించవచ్చు.

బూడిద తెగులు

ఈ తెగులు ఆకులు, పూతపై ఆశించినప్పుడు బూడిదలాంటి తెల్లని ప్రదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. చల్లని రాత్రులు 15 సెంటీగ్రేడ్, వేడి పగటి వాతావరణం (33 నుంచి 37 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు)అంటే జనవరి 25 నుంచి ఫిబ్రవరి వరకు ఈ తెగులు పూత మీద ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ శిలీంద్రం ఆశిస్తే పూత, పిందె మాడిపోయి రాలిపోతుంది.

నివారణ చర్యలు: ముదు జాగ్రత్తగా జనవరిలో నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి చెట్టు మొత్తం తడిచేలా ఉదయం లేదా సాయంత్రం పిచికారీ చేయాలి. మామిడి పూత మొత్తం విచ్చుకున్న తర్వాత (జనవరి 25వ తేదీ తర్వాత) నీటి తడులు ఇచ్చిన వారం రోజుల తర్వాత హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లు ఒక్క లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పూత కోసం జాగ్రత్తలు

మామిడి తోటలో పూత రావాలంటే ప్రస్తుతం లీటరు నీటిని 5 గ్రాములు పొటాషియం నైట్రేటు, 5గ్రాముల యూరియా కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని 10–15 రోజుల వ్యవధిలో 2 నుంచి 3సార్లు పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేటు అందుబాటులో లేకపోతే మల్టీకే వాడవచ్చు. జనవరి నెలలో మచ్చ, బూడిద తెగులు, తేనె మంచు పురుగులు వ్యాపించడానికి అవకాశం ఉంది. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్, దీనితో పాటు కార్బండిజమ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు మొదలు కొమ్మలు, రెమ్మలు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి. జింక్ లోపమున్న తోటలో జింక్ సల్ఫేట్‌ను 2 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పూత రాలకుండా..

మామిడి తోటల్లో పూత రాలకుండా ఉండాలంటే రోగస్ డైమిథేన్ 2 మిల్లీ 1లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు బెడద తగ్గి పూత నిలబడుతుంది. తోటల్లోని ఒక్కో మామిడి చెట్టుకు పశువుల ఎరువు, 3 కిలోల వేప పిండి, 750 గ్రాముల యూరియా, 1,250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. మొక్కల్లో సూక్ష్మ ధాతువు లోపం నివారించేందుకు గాను 5 గ్రాముల జింక్ సల్ఫేట్, యూరియా 20 గ్రాములు 1లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.